క్లుప్తంగా

హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక సర్వీసులు

ధర్మవరం అర్బన్: శ్రావణ మాసంలో ప్రతి మంగళవారం, శనివారం హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి పుణ్య క్షేత్రాలను ఒకే రోజు భక్తులు దర్శించుకునేందుకు ఈనెల 6, 10, 13, 17, 20, 24, 27, 31 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. పెద్దలకు రూ.580, పిల్లలకు రూ.300 చార్జీ ఉంటుందన్నారు. ఒకే బ్యాచ్‌కు చెందిన భక్తులకు ప్రత్యేక రిజర్వేషన్ బస్సు కల్పిస్తామని తెలిపారు. బుకింగ్ కోసం 6303151302 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆర్టీటీ సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఇందులో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బీ అర్చన లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం, గంగోత్రి షాట్ పుట్‌లో ప్రథమస్థానం, సాయి ప్రియ పరుగుపందెంలో విజేగా నిలిచింది. మండల స్థాయి విజేతలు త్వరలో అనంతపురంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం వెంకటాచలం తెలిపారు.

ఆర్టీసీ సర్వీసు నడపాలి


గ్యారేజీ ముందు ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

కదిరి అర్బన్: గాండ్లపెంట మండలం కటారుపల్లి నుంచి కదిరికి ఆర్టీసీ సర్వీసును సకాలంలో నడపాలంటూ ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం గ్యారేజీ గేట్లు మూసేసి విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరచూ బస్సు లేటుగా వస్తుండడంతో విద్యార్థులు కదిరిలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సును సకాలంలో నడపాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ డీఎం హరిత ధర్నావద్దకు వచ్చిన బస్సు సర్వీసును సకాలంలో నడుపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఎస్ఎస్‌యూఐ నాయకులు ఉపేంద్ర,తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించండి

హిందూపురం టౌన్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ రెసిడెన్షియల్ మొత్తం 120 పాఠశాలల్లో ఈ నెల 8న జరగనున్న ఎస్ఎంసీ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి ఛసూచించారు. శనివారం పట్టణంలోని చిన్మయా పాఠశాలలో ప్రాథమిక పాఠశాలలు 80, ప్రాథమికోన్నత 16, ఉన్నత 21, రెసిడెన్షియల్ 3 పాఠశాలలకు సంబంధించి హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్దే ధ్యేయంగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు ఎన్నిక జరపాలని, 3 గంటలకు మొదటి సమావేశం నిర్వహించాలన్నారు.

చిలమత్తూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఈ నెల 8 న నిర్వహించనున్నట్టు ఎంఈఓ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎన్నికలకు సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు.

చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న ట్రాన్స్‌కో రిటైర్డ్ ఉద్యోగి టీడీ రఘునాథరెడ్డి

నల్లమాడ: స్థానిక ఎస్సీ కాలనీలో శనివారం రిటైర్డ్ ట్రాన్స్‌కో ఉద్యోగి టీడీ రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, యువనాయకుడు టీడీ క్రిష్ణ సుమన్ దేశాయ్ (కిట్టు) ఆధ్వర్యంలో 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దాతలు మాట్లాడుతూ తమ తండ్రి, రిటైర్డ్ వీఏఓ టీడీ రామకృష్ణారెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా ఎస్సీ కాలనీలోని మహిళలందరికీ చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.

‘మల్చింగ్’ సాగు.. బహుబాగు

- మల్చింగ్ షీట్ విధానంలో పంటల సాగుకు రైతుల ఆసక్తి
- టమాట, మిరప, వంగ, బొప్పాయి పంటల సాగు
- పంట నాణ్యతతో పాటు అధిక దిగుబడి
- తక్కువ నీటితో పంట సాగు


పరాకువాండ్లపల్లి వద్ద మల్చింగ్ షీట్ విధానంలో సాగు చేసిన టమాట పంట

తనకల్లు: మారిన వాతావరణ పరిస్థితుల్లో మల్చింగ్ షీట్ సాయంతో పంటలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. టమాట, మిరప, వంగ, బొప్పాయి, దోస తదితర ఉద్యాన పంటలను మల్చింగ్ షీట్ విధానంలో సాగు చేస్తున్నారు. మల్చింగ్ షీట్ వేసి పంట సాగు చేయడం కొంత ఖర్చుతో కూడినప్పటికీ ఆ తరువాత కలుపు నివారణ, చీడల బెడద, తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉంటుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల మల్చింగ్ షీట్ విధానంలో సాగు చేసిన పంటలకు నీటి ఆదా చేయవచ్చని రైతులంటున్నారు. ఈ విధానంలో మల్చింగ్ కింద డ్రిప్ పైప్ ఉండడం వల్ల మొక్కకు నీరు సమృద్ధిగా అందుతుంది. చెట్టుకింద భూమి పొడిగా ఉండి వేరు వ్యవస్థ ఆరోగ్యంగా పెరుగుతుంది. దీంతో మల్చింగ్ షీట్ పద్ధతిలో పంటలను సాగు చేయడానికి రైతులు మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసిన అన్ని రకాల పంటలను మల్చింగ్ షీట్ విధానంలో సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు. మల్చింగ్ షీట్ ద్వారా వ్యవసాయం చేస్తే రైతులు ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

మల్చింగ్ షీట్ ప్రయోజనాలు ఇలా..

వర్షపు నీరు నేరుగా భూమిపై పడి మట్టికోతకు గురి కాకుండా మల్చింగ్ షీట్ అడ్డుకుంటుంది. తద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవచ్చు. మల్చింగ్ షీట్ మొక్క వేర్ల చుట్టూ ఉండే వాతావరణ పరిస్థితులను కలగుజేసి, ఉష్ణోగ్రతను నియంత్రిస్తుంది. దీని వల్ల వేరు ధృడంగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. చిన్న పంటలను కూడా మల్చింగ్ ద్వారా సాగుచేస్తే వర్షాభావ పరిస్థితుల్లో నీటిని ఆదా చేసుకోవచ్చు. డ్రిప్పు ద్వారా వేసిన ఎరువులు మొక్కకు బాగా అందుతాయి. మల్చింగ్ వల్ల తెగుళ్లు తక్కువగా వస్తాయి. మల్చింగ్ షీట్లు పరిచిన నేలల్లో సూర్యరశ్మి బాగా ప్రసరించి భూమిలో దాగి ఉండే క్రిమి కీటకాలు, తెగుళ్ల వ్యాప్తికి కారణమైన సూక్ష్మజీవులు నశిస్తాయి. పంట ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో కూడిన అధిక దిగుబడులను పొందవచ్చు.

మల్చింగ్‌తో నీరు ఆదా



మల్చింగ్ షీట్‌తో టమాట పంటను సాగు చేస్తున్నా. నేనే కాదు మా గ్రామంలో చాలా మంది రైతులు మల్చింగ్ షీట్‌తోనే పంటలను సాగు చేస్తున్నారు. దీని వల్ల కలుపు బెడద ఉండదు. తెగుళ్లు కూడా తక్కువగా వస్తాయి. కూలీల ఖర్చు తక్కువే. ఈ పద్ధతిలో పంట దిగుబడి కూడా బాగుంటుంది.

– జయచంద్రారెడ్డి, రైతు, మండ్లిపల్లి

నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు



మల్చింగ్ షీట్ వేయడం వల్ల టమాట, వంగ, దోస, బొప్పాయి, మిరప, కర్బూజ పంటలను మామూలు పద్ధతిలో సాగు చేసిన దాని కంటే నాణ్యతతో కూడిన అధిక దిగుబడులను సాధించవచ్చు. కలుపు, తెగుళ్ల సమస్యలను అరికట్టవచ్చు. తక్కువ నీటితో పంటలను సాగు నీటి ఆదాను పొందవచ్చు. మల్చింగ్ షీట్ విధానం రైతులకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది.

–లావణ్య, హెచ్ఓ, తనకల్లు

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న ఐఈడీ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు

బత్తలపల్లి: మానసిక దివ్యాంగ పిల్లలు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా ఐఈడీ(ఇన్‌క్ల్యూజివ్ ఎడ్యుకేషన్ ఫర్ డిజైబుల్) ప్రత్యేక విద్య కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లి మండలంలో ఆయన పర్యటించారు.ఇంటి వద్ద విద్య(హోమ్ బేస్‌డ్ ఎడ్యుకేషన్)ను ఆయన తనిఖీ చేశారు. ఇంటి దగ్గర విద్యార్థులు ఏమి చేస్తున్నారు? చదువుకుంటున్నారా? ఆడుకుంటున్నారా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులకు హెచ్‌బీఈ ప్రాధాన్యతను వివరించారు. ప్రతి సోమవారం మానసిక దివ్యాంగ పిల్లలకు భవిత కేంద్రంలో ఫిజియోథెరఫీ చేయించాలన్నారు. వారికి ఎస్కార్ట్, హెచ్‌బీఈ, ట్రావెలింగ్, గర్ల్స్ అలవెన్స్‌లు ఇస్తామన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామంచేయాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఐఈఆర్‌టీలు ఖాదిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

5న కలెక్టరేట్ ధర్నా జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం అర్బన్: ఈనెల 5న జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, కోకన్వీనర్ అయూబ్‌ఖాన్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ, ఐకేపీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన పథకం, మున్సిపల్ ఇంజనీరింగ్ తదితర రంగాల కార్మికులపై అధికార పార్టీ నేతల వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వాటిని అరికట్టాలని కోరుతూ ఈనెల 5న పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నామని తెలిపారు. ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు పోతక్క, అరుణ, మమత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: ఈనెల 5న జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికులపై అధికార పార్టీ నేతల వేధింపులను అరికట్టాలని కోరుతూ ధర్నా చేపడుతున్నామన్నారు. వీరప్పగారిపల్లికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నాగవేణి ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఆంజనేయులు అరెస్ట్ చేసి నాగవేణికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంగమ్మ, ఆశీర్వాదమ్మ, సీఐటీయూ నాయకులు శ్రీరాములు,కుళ్ళాయప్ప, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీఐటీయూ మండల నాయకులు గోవిందు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు రంగమ్మ, కమలమ్మ తదితరులు మాట్లాడారు. ఈనెల 5న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ కో కన్వీనర్ వెంకటేష్, సెక్టారు నేతలు పద్మావతి, అరుణ, లక్ష్మీదేవి, మేరీ సుజాత, రత్నమ్మ, లక్ష్మినరసమ్మ, నరసింహులు, గంగాద్రి పాల్గొన్నారు.

నర్సరీలకు లైసెన్స్‌లు తప్పనిసరి



నర్సరీ యజమానికి నోటీసు అందిస్తున్న హెచ్ఓ నవీన్‌కుమార్

నల్లమాడ: మండలంలో వివిధ రకాల కూరగాయలు, పండ్ల మొక్కలు విక్రయించే నర్సరీల యజమానులు నర్సరీలకు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని మండల ఉద్యానవన అధికారి నవీన్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం గ్రామ ఉద్యానవన, వ్యవసాయ సహాయకులతో కలసి నల్లమాడలోని నర్సరీలను తనఖీ చేశారు. లైసెన్స్‌లు పొందాలంటూ యజమానులకు నోటీసులు అందజేశారు. ఉద్యానవన అధికారి మాట్లాడుతూ నర్సరీలకు లైసెన్స్ పొందేందుకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీలు రిజిస్ట్రేషన్ చేయించని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు లోకేష్, వినోద్, షాన్‌వాజ్, శిరీషా, స్వరూప పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు

కదిరి టౌన్: వాల్మీకి పాఠశాల సమీపంలో ఉన్న చౌడేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.45 గంటలకు చౌడేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, 7.45 నవగ్రహాలకు తైలాభిషేకం పంచామృతాభిషేకం, 8.30 చౌడేశ్వరి దేవి అమ్మవారికి సహస్ర బిల్వార్చన, శ్రీచక్రకుంకుమార్చన, 10 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, 11 గంటలకు ఉయ్యాల ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని వివరించారు.

ట్రాఫిక్‌పై దృష్టి సారించండి


సిబ్బందితో సమావేశమైన ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: మండల కేంద్రంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోపుడు బండ్లు, వ్యాపారస్తులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానా విధించాలని సూచించారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుదారులకు సమస్యల పరిష్కారంపై భరోసా కల్పించాలన్నారు. ఏఎస్ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

తలుపుల: మండలంలోని ఎస్.రాచువారిపల్లికి ఓ యువతి అదృశ్యమైంది. వివరాలు..గంగాధర్ కుమార్తె శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి యువతి కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

తల్లిపాలు అమృతంతో సమానం


తనకల్లు మండలం బాలసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న రఫి మున్నీషా

తనకల్లు: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. బాలసముద్రం, గందోడివారిపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి కనీసం తన శిశువుకు ఆరు నెలలు తల్లిపాలనే పట్టించాలన్నారు. ఆరు నెలల తరువాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందజేయాలన్నారు. తల్లిపాలలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీలను చేపట్టారు. కార్యదర్శి ధనుంజయ, ఆరోగ్య సిబ్బంది మంజుల, మోహన్‌రెడ్డి, ముసల్‌రెడ్డి, లక్ష్మి నరసమ్మ, మహిళా కార్యదర్శి ఫర్జానా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి అర్బన్: యర్రదొడ్డి కొత్తపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యతను అంగన్వాడీ కార్యకర్త అమరావతి గర్భిణులు, బాలింతలకు వివరించారు. తల్లిపాలు బిడ్డకు పడితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఏఎన్ఎం సునీత, ఆశావర్కర్ రామాంజులమ్మ, హెల్పర్ గిరిజారాణి పాల్గొన్నారు.

నల్లచెరువు: తల్లిపాలతోనే పసి పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రఫి మున్నిషా అన్నారు. యర్రగుంటపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రఫి మున్నీషా మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు ఆరు నెలల పాటూ తల్లిపాలనే తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: తల్లి పాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని సీహెచ్ఓ నగేష్ తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎనుములపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వ్యక్తి గత పరిశుభ్రత పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పరిమళ, సుహాసిని, శైలజ, రాధమ్మ, అమృత పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం


గాండ్లపెంటలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

గాండ్లపెంట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందక్రిష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ 30 ఎళ్ల సుదీర్ఘకాలంలో ఎస్సీ వర్గాలు వర్గీకరణ కోసం ప్రాణ త్యాగాలు చేశాయన్నారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మేకల నరసింహులు, కొండయ్య, జంపాల రమణ, ఉత్తన్న, వెంకటరమణ, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడంతో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక ఆర్టీటీ పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పోరాట ఫలితమే వర్గీకరణ అని నాయకులు పేర్కొన్నారు. నాయకులు ఉత్తన్న, ఎ గంగాద్రి, శంకర, ఎ శేఖర్, నాగరాజు, గంగాద్రి, వేమనారి, అశోక్, యోగేశ్వర్, నరసిహులు, అంజి, హరి ప్రసాద్, రెడ్డిభాస్కర్, సీవీ రావు, కండక్టర్ గంగాద్రి, సిద్దగోళ్ల గంగాద్రి, బాలవీర్, సంతోష్, శివశంకర్ పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం

కదిరి టౌన్: భార్య కాపురానికి రాలేదని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. ఓడీచెరువు మండలం మల్లాపల్లికి చెందిన కుమార్‌కు అదే గ్రామానికి చెందిన కృష్ణవేణితో 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో క్రిష్ణవేణి రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. తర్వాత కాపురానికి రావాలని పలుమార్లు ఆమెను కోరినా నిరాకరించింది. ఈనేపథ్యంలో శనివారం రాత్రి పట్టణంలోని మారుతీ సర్కిల్ వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని పట్టణ ఎస్ఐ బాబ్జాన్ తెలిపారు.

భక్తులతో ఖాద్రీ ఆలయం కిటకిట

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభుడిని దర్శించుకున్నారు. నమోనరసింహ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలతో అన్నదానం చేపట్టారు.

వైభవంగా ఆషాఢ శని వారోత్సవం

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో చివరి ఆషాఢ శని వారోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామికి తైలాభిషేక పూజలతో పాటు సర్వ సేవా పూజలు నిర్వహించారు. శీతలాంబదేవికి కుంకుమార్చన చేశారు. అగ్ని గుండంలో నల్ల ఒత్తులు, నువ్వుల తైలం సమర్పించి తొమ్మిది సార్లు అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం వచ్చే అమావాస్యతోఆషాఢ మాసం సమాప్తమవుతుంది. అనంతరం సోమవారం నుంచి శ్రావణ మాస సంబరాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఆలయం నుంచి శిరా రోడ్డు, బళ్లారి రోడ్డు వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

హమ్మయ్య.. డబ్బు దొరికింది!

తనకల్లు : ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ దారులకు బట్వాడా చేయాల్సిన నగదులో రూ.50వేలు సచివాలయంలోనే మాయమైంది. ఒక రోజు వ్యవధిలో తిరిగి ఆ నగదు లభించడంతో సచివాలయ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. తనకల్లు సచివాలయం-1 వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాణి, మరికొంతమంది ఉద్యోగులు కలిసి సామాజిక భద్రత పింఛన్లకు సంబంధించి జూలై 31న ఎస్‌బీఐ నుంచి రూ.39.48 లక్షలు డ్రా చేశారు. ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. మిగిలిన డబ్బును తిరిగి బ్యాంకు ఖాతాలో జమచేసేందుకు లెక్కించగా రూ.50వేలు తక్కువ వచ్చింది. ఈ డబ్బు గురించి తోటి ఉద్యోగులను అడిగితే తమకేమీ తెలియదన్నారు. కార్యాలయంలో వెతికినా ఎక్కడా కనిపించలేదు. వెల్ఫేర్ అసిస్టెంట్ శుక్రవారం ఉద్యోగులను పిలిచి రేపు అందరూ కలిసి నల్లచెరువు పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లి నగదు తీసుకోలేదని ప్రమాణం చేయాలని తెలిపారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం వెల్ఫేర్ అసిస్టెంట్ తన టేబుల్ డ్రాను తెరవగా అందులో రూ.50వేలు కనిపించాయి. దీంతో పోయిన డబ్బు దొరకడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా నాగరాణి, మరికొంతమంది ఉద్యోగులు పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకుని, టెంకాయకొట్టి వచ్చారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న గంగాదేవి

కనగానపల్లి: మండలంలోని చంద్రాచ్చర్ల గ్రామానికి చెందిన వివాహిత గంగాదేవి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి రైతు శ్రీనివాసులు భార్య గంగాదేవి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్థాపానికి గురైన ఆమె శనివారం వారి పొలం వద్ద ఉన్న పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

తండ్రీకుమారుడికి తీవ్రగాయాలు

ఎన్పీకుంట: బందారుచెట్లపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గోవిందరాజులపల్లికి చెందిన తండ్రీకుమారులు ఆర్. ఇరగంరెడ్డి, మణికంఠరెడ్డి వ్యవసాయ బోరు మోటరు(సబ్‌మెర్సిబుల్) మరమ్మతు కోసం బైక్‌పై మండల కేంద్రానికి బయలుదేరారు. ఇదే సమయంలో కదిరి నుంచి రాయచోటి కి వెళుతున్న ఆర్టీసీ బస్సు బందారుచెట్లపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న ఓ స్వల్ప మలుపువద్ద బస్సు వెనుకభాగం ద్విచక్ర వాహనానికి ఢీకొంది. ద్విచక్ర వాహనం బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం కదిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

3,227 క్వింటాళ్ల బియ్యం వేలం

పుట్టపర్తి అర్బన్: వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో పట్టుబడిన 3227 క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం వేలం వేశారు. స్థానిక కోర్టు హాల్‌లో జేసీ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వెంకటేష్, గాండ్లపెంట ప్రకాష్, అనసూయమ్మ అనే వ్యక్తులు వేలం దక్కించుకున్నారు. ఈ నెల 5న నగదు చెల్లించి స్టాక్ తీసుకెళ్లవచ్చని జేసీ వారికి సూచించారు. చెన్నేకొత్తపల్లిలో 884.81 క్వింటాళ్లు, గాండ్లపెంటలో 9.32 క్వింటాళ్లు, కదిరిలో 1028.50 క్వింటాళ్లు, మడకశిరలో 543.90 క్వింటాళ్లు, ఓడీ చెరువులో 1561.20 క్వింటాళ్లు, పెనుకొండలో 613.26 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. డీఎస్ఓ వంశీక్రిష్ణారెడ్డి, డీఎం అశ్వర్థనాయక్ పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం


శేషంపల్లిలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామగిరి: శేషంపల్లిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సుధాకర్, చంద్రోశేఖర్, మౌలాలి బాషా మాట్లాడుతూ.. పాడిపశువులకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఫలితాలు ఉంటాయన్నారు. పశువులకు ఎద ఇంజక్షన్లు వేసిన తరువాత 20 రోజుల పాటు బెల్లం నీళ్లు, టెంకాయ నీళ్లు తాగించడంతో పాటు మునగాకు, కరివేపాకు మేతగా పెట్టాలని సూచించారు. దాదాపు 50 పశువులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.